

Truth of News

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మహ్మద్ షఫీ అహ్మద్

IRS PUBLICATIONS

irspublications12@gmail.com

శుక్రవారం 15 నవంబర్ 2024 తిరుపతి

సంపుటి 1 సంచిక 146 పేజీలు 8 వెల: రూ.6.00

Published from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకే..

# సూపర్-6 పథకాలు

- 227 ఎంవోయూలు.. పైసా రాలేదు
- ఐదేళ్ల జగన్ పరిపాలన నిర్వాకం ఇదీ: చంద్రబాబు
- పన్నులు, కరెంటు ఛార్జీలు పెంచడంతో నాడు కుంటుబడ్డ పరిశ్రమల మనుగడ
- ప్రోత్సాహకాలు ఇవ్వకుండా ఇబ్బందులు..
- రాష్ట్రం నుంచి కంపెనీలు పారిపోయాయి
- పరిశ్రమలకు సత్వర అనుమతులే లక్ష్యం
- 30 లక్షల కోట్ల పెట్టుబడులు.. 20 లక్షల ఉద్యోగాలు.. రూ.83 వేల కోట్ల ఎఫ్‌డీఐలు
- ఎన్టీపీసీ, జెన్కోల రూ.84,700 కోట్ల భారీ పెట్టుబడి
- శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

**అమరావతి-సూర్య వాస్తవం**

గత ఐదేళ్లలో పాలకుల విధ్వంసకర విధానాలతో సర్వనాశనమైన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి నడిపి దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఆరు పాలసీలు రూపొందించామని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీ పారిశ్రామిక అభివృద్ధి విధానం 4.0, ఏపీ ఎంఎసఎంఈ – ఎంట్రప్రెన్యూర్ అభివృద్ధి విధానం 4.0, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ, ఏపీ ప్రైవేటు పార్కుల విధానం, ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ అనే ఆ ఆరు విధానాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను ముఖ్యమంత్రి వివరించారు. జగన్ హయాంలో గడచిన ఐదేళ్లలో 227 ఎంవోయూలు జరిగినా రాష్ట్రానికి పైసా పెట్టుబడి రాలేదన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. గత ఐదేళ్లలో పన్నులు, కరెంటు చార్జీలు పెంచడం వల్ల పరిశ్రమలు మనుగడ సాధించలేని దుస్థితిలోకి దిగజారాయన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని గుర్తుచేశారు. 'వైసీపీ నిర్లక్ష్యం కారణంగా గత ఐదేళ్లలో రాష్ట్రం నుంచి కంపెనీలు పారిపోయాయి. 2014-19



- మిగతా 2లో..

## ప్రధాని మోడీకి డొమినికా అత్యున్నత

# జాతీయ పురస్కారం



**రోజెవు-సూర్య వాస్తవం**

తమ దేశ అత్యున్నత జాతీయ పురస్కారాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీకి అందజేయనున్నట్లు కామన్వెల్త్ ఆఫ్ డొమినికా ప్రకటించింది. కోవిడ్ ప్రబలిన సమయంలో డొమినికాకు భారత్ అందించిన సాయానికి గుర్తుగా అలాగే రెండు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు మోడీ చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు ఇస్తున్నట్లు డొమినికా అవార్డ్ ఆఫ్ ఆనర్ తెలిపింది. ఫిబ్రవరిలో 70వేల డోసుల అస్ట్రాజెనికా వ్యాక్సిన్‌ను భారత్ అందచేసిందని ఆ ప్రకటనలో పేర్కొంది. ఆరోగ్య సంరక్షణ, విద్య, సమాచార సాంకేతిక పరిజ్ఞానం వంటి రంగాల్లో డొమినికా రిపబ్లిక్‌కు భారత్ అందిస్తున్న తోడ్పాటును ప్రశంసించారు. భారత్, కారికామ్ సభ్య దేశాల మధ్య సహకారానికి గల కొత్త అవకాశాలను చర్చించేందుకు నవంబరులో జరిగే సదస్సులో డొమనికా అధ్యక్షుడు సిల్వనే బర్టన్, ప్రధాని రూజ్‌వెల్ట్ స్కిరిట్‌లు పాల్గొంటారు. కామన్వెల్త్ ఆఫ్ డొమినికా అభివృద్ధికి విశిష్ట సేవలందించిన వ్యక్తులకు సాధారణంగా ఈ అవార్డులు అందచేస్తూంటారు. గతంలో క్యూబా నేత ఫిడెల్ కాస్ట్రోకు కూడా ఈ పురస్కారాన్ని అందచేశారు.

## మరాఠా ఎన్నిక

# ప్రచారంలో తెలుగు 'ఆంధీ'

- మహారాష్ట్ర ఎన్డీఏ కూటమి పక్షాన ప్రచారానికి "పవన్ కళ్యాణ్"
- బీజేపీ పెద్దల అభ్యర్థనను గౌరవించిన 'జనసేనాని'
- ఈనెల 16, 17 తేదీల్లో పవన్ ప్రచారానికి షెడ్యూల్ ఖరారు

**అమరావతి-సూర్య వాస్తవం**

"యే పవన్ నహీ హై..ఆంధీ హై (అతను గాలి కాదు. తుఫాను)." అని కొద్దినెలల కిందట ఎన్డీఏ ఎంపీల సమావేశంలో ప్రముఖ నటులు, రాజకీయవేత్త, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పరిచయం చేసిన సంగతి అందరికీ తెలిసిందే. ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికలు – 2024, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేసిన అన్ని స్థానాలను గెలుచుకోవడం ద్వారా పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ చారిత్రాత్మక విజయంతో రాజకీయ రంగాన్ని తుఫానుగా తీసుకున్నందున ఉరుములతో కూడిన కరతాళ ధ్వనుల మధ్య ఈ వ్యాఖ్య వచ్చింది. సరిగ్గా ఇప్పుడు అదే పొలిటికల్ పెను (ఆంధీ) తుఫాను అస్త్రంగా మహారాష్ట్ర ఎన్నికల్లోనూ విజయం సాధించాలని ఎన్డీఏ కూటమి (బీజేపీ) పెద్దలు ప్రధాని మోదీ, అమిత్ షా వ్యూహం రచించారు. ఇందులో భాగంగా ఇటీవల ఢిల్లీ టూర్ వెళ్ళిన ఏపీ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ ను మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి ఆహ్వానించారు. తనపై నమ్మకంతో వారు అప్పగించే ఎన్నికల ప్రచార బాధ్యతల అభ్యర్థనపై మారు మాట్లాడకుండా పవన్ కళ్యాణ్ అంగీకారం తెలిపారు. వారి ఎన్నికల ప్రచారానికి సైతం షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 16, 17 తేదీల్లో పవన్ కళ్యాణ్ మహారాష్ట్ర ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటారు.



**పవన్ ఛరిష్మా అస్త్రంగా..**

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ కీలకంగా వ్యవహరించనున్నారు. ఏపీలో ఎన్డీఏ కూటమి ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. కేంద్రంలోని బీజేపీ పెద్దలకు, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు మధ్య వారధిలా పనిచేసిన పవన్ కల్యాణ్ కూటమి ఏర్పాటు చేయడంలో సక్సెస్ అయ్యారు. అంతేకాకుండా, ఏపీలో ఎన్నికల ప్రచారానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా వంటి అగ్రనేతలను తీసుకురాగలిగారు. ఇటు, ఏపీతో పాటు దేశవ్యాప్తంగా ఎన్డీఏ విజయదుందుభి మోగించడం, ఏపీలో కూటమి తరపున గెలుపొందిన ఎంపీలు మోదీ సర్కార్ ఏర్పాటులో కీలకం కావడంతో పవన్ కళ్యాణ్ గారి ప్రాధాన్యత పెరిగింది. ఈ క్రమంలోనే పవన్ ని 'ఆంధీ'(తుఫాన్) తో పోల్చుతూ ప్రధాని మోదీ ప్రశంసించారు. ఈ క్రమంలోనే ఈ తుఫానును మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో

- మిగతా 2లో..

# తల్లిని అవమానిస్తే సహించాలా?

- శాసన మండలిలో విరుచుకుపడ్డ మంత్రి లోకేశ్
- అసెంబ్లీలో నా తల్లిని అవమానించారు..
- ఆ తర్వాతే సభను బాబు బహిష్కరించారు
- గౌరవ సభగా మారాకే వస్తానన్నారు.. ఆయన పారిపోలేదు.. సింహంలా నిలబడ్డారు
- నాడు టీడీపీ ఎమ్మెల్యేలంతా సభకు హాజరయ్యారు.. నేడు వైసీపీ ఎమ్మెల్యేలు రారేం?
- మీలాగా మేం ఎన్నడూ మాట్లాడలేదు

**అమరావతి-సూర్య వాస్తవం**

శాసన మండలిలో విపక్షంపై మంత్రి నారా లోకేశ్ నిప్పులు చెరిగారు. చంద్రబాబు తమ హయాంలో శాసనసభకు రాకుండా పారిపోయారంటూ వైసీపీ సభ్యులు చేసిన వ్యాఖ్యలపై విరుచుకుపడ్డారు. నాడు



అసెంబ్లీలో చంద్రబాబు సింగిల్‌గా, సింహంలా నిలబడ్డారని తెలిపారు. తన తల్లిని అవమానించిన తర్వాతే... ఈ కౌరవ సభలో అడుగు పెట్టేదిలేదని ప్రకటించి బహిష్కరించారని గుర్తు చేశారు. ఆ తర్వాత కూడా టీడీపీ సభ్యులు సభకు వచ్చారని తెలిపారు. జగన్‌తోసహా 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలున్నారని... వారు ఇప్పుడు అసెంబ్లీకి ఎందుకు రావడంలేదని లోకేశ్ నిలదీశారు. గురువారం శాసన మండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరిగింది. సభ ప్రారంభమైనప్పటి నుంచే వాతావరణం వేడెక్కింది. ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు పడలేదని వైసీపీ సభ్యులు పదేపదే ఆరోపించారు. ఎన్నికల ముందు

- మిగతా 2లో..

# శ్రీలంకలో ప్రశాంతంగా పోలింగ్

## ఓటు హక్కు వినియోగించుకున్న 1.70 కోట్ల ఓటర్లు



**కొలంబో-సూర్య వాస్తవం**

శ్రీలంక పార్లమెంట్‌కు గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4గంటలకు పూర్తయింది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. శుక్రవారం ఉదయానికల్లా తొలి ఫలితాలు వస్తాయని భావిస్తున్నారు. కాగా, 225 సీట్లు గల పార్లమెంట్‌లో మూడింట రెండు వంతుల మెజారిటీని సాధించగలమని అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకె పార్టీ ఆశిస్తోంది. ఆర్థిక సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్ళాలంటే మంచి మెజారిటీ కావాలని అధ్యక్షుడు భావిస్తున్నారు. ఈ ఎన్నికలు పాలక పార్టీ నేషనల్ పీపుల్స్ పవర్ పార్టీ (ఎన్‌పిపి)కి లిట్మస్ పరీక్ష వంటివి. దేశవ్యాప్తంగా 13,314 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. కోటీ 70లక్షల మందికి పైగా అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సెప్టెంబరులో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చిన దిసనాయకె.. అవినీతిపై పోరాడతామని, ఇందుకు ప్రజల మద్దతు కావాలని పేర్కొన్న సంగతి తెలిసిందే.

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## మరాఠా ఎన్నిక

# ప్రచారంలో తెలుగు 'ఆంధీ'

(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగించుకోవాలని ప్రధాని మోదీ భావించారు.

**తెలుగు ప్రజల ఆదరణ నేపథ్యంలో..**

మహారాష్ట్రలోని తెలుగు వారు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ ఈ నెల 16, 17 తేదీల్లో బీజేపీ తరపున ప్రచారం చేయనున్నారు. ఇందుకోసం బీజేపీ సీనియర్ నేతలు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు. మొన్నామధ్య జరిగిన తమిళనాడు ఎన్నికలలోనూ పవన్ కళ్యాణ్ బీజేపీ తరఫున ప్రచారం చేశారు. పవన్ కళ్యాణ్ కి ఉన్న సినీ గ్లామర్ తో పాటు సనాతన ధర్మం కోసం పవన్ చేస్తోన్న పోరాటం వంటి విషయాల నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో ఆయన కీలకంగా మారబోతున్నారని జాతీయస్థాయిలో విశ్లేషకుల చర్చ గమనార్హం.

# తల్లిని అవమానిస్తే సహించాలా?

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ వాటి అమలు ఎక్కడ అని ప్రశ్నించారు. దీనికి మంత్రులు గట్టిగా సమాధానమిచ్చారు. ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలనూ అమలు చేయడంలేదంటున్నారని మంత్రులు మండిపడ్డారు. "వైసీపీ సభ్యులు అసత్యాలు, అర్ధ సత్యాలు చెబుతున్నారు. వీళ్ల నాయకుడు శాసన సభకు రారు. వీళ్లు మండలిలో అసత్యాలు చెప్పి రెచ్చగొడుతున్నారు. వీళ్ల నాయకుడు సభకు రాకుండా పారిపోయారు. వీళ్లూ పారిపోతారు" అని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి విమర్శించారు. దీంతో తమ హయాంలో చంద్రబాబు సభ నుంచి పారిపోయారంటూ వైసీపీ సభ్యులు వ్యాఖ్యానించారు. దీనిపై మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ హయాంలో చంద్రబాబు ప్రతి రోజూ అసెంబ్లీకి వచ్చారని, తన తల్లిని అవమానించిన తర్వాతే బాయ్‌కాట్ చేశారని చెప్పారు. కౌరవ సభ గౌరవసభ అయిన తర్వాతే వస్తానని ప్రకటించారు. ఆ తర్వాత కూడా తమ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారు. అదీ తమ చిత్తశుద్ధి అన్నారు. లోకేశ్ వ్యాఖ్యలపై విపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పందిస్తూ... తల్లిని, చెల్లిని, కుటుంబ సభ్యులను అవమానిస్తే ఎవరూ ఒప్పుకోరన్నారు. గతంలో జరిగిన ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించడంలేదని తెలిపారు. దీనిపై లోకేశ్ మాట్లాడుతూ... "ఆ రోజు అవమానించినవారికే టికెట్లు ఇచ్చారు. కదా? అది సమర్థించడం కాదా?" అంటూ బొత్సను ప్రశ్నించారు.

# కాలుష్య కోరల్లో విలవిల్లాడుతున్న ఢిల్లీ


**ఢిల్లీ:** దేశ రాజధాని న్యూఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని విలవిల్లాడుతోంది. గాలి నాణ్యత గురువారం ఉదయం 'తీవ్రమైన' కేటగిరీలో కొనసాగుతుందని కేంద్ర కాలుష్య నియంత్రణ సంస్థ (సిపిసిబి) పేర్కొంది. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఎఐక్యూ) గురువారం ఉదయం 9 గంటలకు 426గా నమోదైనట్లు తెలిపింది. దీనిని 'తీవ్రమైన' కేటగిరీగా పరిగణిస్తారని, శుక్రవారం పరిస్థితి కాస్త మెరుగుపడే అవకాశం ఉందని పేర్కొంది. స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ గాలి నాణ్యత పరిశీలన సంస్థ 'ఐక్యూఎయిర్' వద్ద నమోదైన 120 నగరాల గణాంకాల ప్రకారం..గురువారం ఉదయం ప్రపంచంలోనే రెండవ "అత్యంత కాలుష్య" ప్రధాన నగరంగా ఢిల్లీ నిలిచింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఢిల్లీకి వెళ్లే విమానాలపై ప్రభావం చూపవచ్చు అని ఇండిగో తన వినియోగదారులకు సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేసింది.



# రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకే సూపర్ 6 పాలసీలు

(మొదటి పేజీ తరువాయి)

సమయంలో పరిశ్రమలకు మేం రూ.3,900 కోట్ల ప్రోత్సాహకాలు ఇవ్వగా, జగన్ కేవలం రూ.1,900 కోట్లే ఇచ్చారు. కేంద్రం ఇచ్చే పీఎల్ఐ (ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకం) పథకాన్ని జగన్ నిర్లక్ష్యం చేయడం వల్ల రాష్ట్రానికి రూ.1,28,000 కోట్ల గ్రాంటు, 8,50,000 ఉద్యోగాలు అందకుండా పోయాయి. అలాగే, పెట్టుబడుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఈడీబీ'ని (ఎకనమికల్ డెవల్‌పమెంట్ బోర్డు) జగన్ రద్దుచేశారు. దానిని మేం ఇప్పుడు తిరిగి ప్రారంభిస్తున్నాం. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ ద్వారా కొత్తగా రూ.30,000 కోట్ల పెట్టుబడులు, ఒక బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు తీసుకురావాలనే ఆశయంతో ఉన్నాం. ఎన్టీపీసీ, జెన్కో కలిసి వైజాగ్‌లో రూ.84,700 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయి." అని చంద్రబాబు తెలిపారు. కాగా, రాష్ట్రానికి మొత్తంగా రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు రావాలన్నది లక్ష్యమనీ, 20 లక్షలమందికి ఉపాధి కల్పన దిశగా కృషి చేస్తున్నామని సీఎం చెప్పారు. రూ.83,000 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నామని చంద్రబాబు వివరించారు.



### జగన్‌ను జీవిత కాలం జైల్లో పెట్టినా తప్పులేదు

గత ప్రభుత్వంలో రుషికొండ ప్యాలెస్ నిర్మాణం కోసం వందల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారని, అక్రమాలన్నీ కళ్ల ముందే కనబడుతున్నందున మాజీ సీఎం జగన్‌ను జీవిత కాలం జైల్లో పెట్టినా తప్పులేదని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో రుషికొండ ప్యాలెసపై చర్చ జరిగింది. రుషికొండపై విలాసవంతమైన భవన సముదాయాలు, గృహోపకరణాలు, పచ్చదనం, మొక్కలు, దీపాలంకరణ, రహదారులు, భద్రత ఏర్పాట్లకు చేసిన ఖర్చు వివరాలు తెలియజేయాలంటూ బీజేపీ ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, ఆదినారాయణరెడ్డి అడిగిన ప్రశ్నకు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ సమాధానమిచ్చారు. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో రుషికొండపై పాత రిసార్టు స్థానంలో 4,30,373 చదరపు అడగుల విస్తీర్ణంలో 7 బ్లాకులుగా నిర్మించిన రిసార్టుకు మొత్తం 409.39 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. దీనిపై విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టు వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు. ప్రజలకు, రాజకీయ నాయకులకు కూడా తెలియనీయకుండా నిర్మించిన రుషికొండ ప్యాలెస్ వెనుక ఉన్న చిదంబర రహస్యంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 'అత్యంత విలాసవంతమైన రుషికొండ ప్యాలెసకు ప్రజల సొమ్ము రూ.వందల కోట్లు దుర్వినియోగం చేశారు. అందులో భారీ దోపిడీ జరిగింది. ప్యాలెస్ లోపలకు వెళితే విస్తుపోయే విషయాలు బయటకు వస్తున్నాయి.

రూ.1.80 లక్షలతో పేదలకు ఇళ్లను నిర్మిస్తుండగా.. రుషికొండ ప్యాలెసలో బాత్‌రూమ్‌లోని కమోడ్‌కు రూ.11,46,84, బాత్‌టబ్‌కు రూ.12,38,763.. ఇలా చెబుతూ పోతే ఒక్క బాత్‌రూమ్‌లోని పరికరాలకే లక్షలు ఖర్చు పెట్టారు. రుషికొండపై జగన్ కోసం నిర్మించిన ప్యాలెసకు చేసిన ఖర్చు.. పేదలకు నిర్మిస్తున్న 22,743 ఇళ్లతో సమానం. అస్మదీయులకు కాంట్రాక్టులు ఇచ్చి ప్రజాధనాన్ని దోపిడీ చేశారు. ఇది చరిత్రలో అతి పెద్ద ఆర్థిక కుంభకోణం. ఏమీ లేని స్కిల్ కేసులో చంద్రబాబును అరెస్టు చేసి 53 రోజులు జైల్లో పెట్టించి జగన్ మానసిక క్షోభకు గురిచేశారు. రుషికొండ ప్యాలెస్ నిర్మాణంలో అక్రమాలన్నీ కళ్ల ముందే కనబడుతున్నందున మాజీ సీఎం జగన్‌ను జీవిత కాలం జైల్లో పెట్టినా తప్పులేదు' అని విష్ణుకుమార్‌రాజు అన్నారు. టీడీపీ సభ్యుడు రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ.. 'రూ.500 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు పెట్టి రుషికొండపై జగన్ కట్టుకున్నది ఇల్లు కాదు.. ఆయన రాజకీయ సమాధి' అని ఎద్దేవా చేశారు. రుషికొండ ప్యాలెసపై తాను వేసిన కేసును ఉపసంహరించుకుంటానని తెలిపారు. దీనిపై ప్రత్యేకచర్చకు సోమవారం సభలో సమయం కేటాయిస్తానని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పారు. దీంతో చర్చను తాత్కాలికంగా ముగించారు.

# రాష్ట్రంలో భారీ భూ కుంభకోణం

**- హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపండి**

**- శాసనసభలో టిడిపి సభ్యుల డిమాండ్**

**అమరావతి-సూర్య వాస్తవం:** వైసిపి ప్రభుత్వ హయంలో రాష్ట్రంలో భారీ భూ కుంభకోణం చోటు చేసుకుందని, దానిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టిడిపి సభ్యులు డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో గురువారం ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. టిడిపి సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, కోండ్రు మురళి, శ్రీరాం రాజగోపాల్, బత్తుల శివరామకష్ణ, పుట్టా సుధాకర్ యాదవ్‌లు ఈ విషయాన్ని ప్రస్తావించారు. 22(ఎ) జాబితాలో ఉన్న భూములు, ఫ్రీ హోల్డ్ పట్టాలు, జగనన్న కాలనీల కోసం సేకరించిన భూములలో భారీగా అవతవకలు జరిగాయని, వాటి విలువ సుమారు రూ.2 లక్షల కోట్ల వరకు ఉంటుందని, ఇది బోఫోర్స్ కుంభకోణం కంటే పెద్దదని చెప్పారు.



### ఒక్క విశాఖలోనే రూ. 3 వేల కోట్ల భూముల రిజిస్ట్రేషన్

22(ఎ) జాబితా నుండి భూములు మినహాయింపులు పొందడానికి వైసిపి నేతలు, మండల తహసీల్దార్లు, మండల స్థాయి నాయకులు కలిసి వ్యవహరించారని ఆరోపించారు.

ఒక్క విశాఖపట్నంలో రూ.3 వేల కోట్ల విలువ ఉన్న 300 ఎకరాల స్థలం రిజిస్ట్రేషన్ అయినట్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిగితే, ఆధారాలు సమర్పించి సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. విశాఖపట్నంలో వైసిపి నేతలు విజయసాయిరెడ్డి , వైవి సుబ్బారెడ్డి కనుసన్నల్లోనే ఈ భూముల రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. విశాఖతోపాటు రాజానగరం నియోజకవర్గంలో కూడా ఇనాం భూములపై నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి వైసిపి నాయకులు భూ ఆక్రమణలు చేశారని తెలిపారు. ఈ దశలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జోక్యం చేసుకుంటూ హౌస్ కమిటీ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని ప్రభుత్వానికి సూచించారు.

### హౌస్ కమిటీ వేసే ఆలోచన : రెవెన్యూశాఖ మంత్రి

అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సభలో మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వ హయాంలో 22(ఎ) జాబితా చట్టాలను తమకు అనుకూలంగా మార్చుకొని భూదోపిడీ చేసినట్లు ఆరోపించారు. భూ కుంభకోణంపై ముఖ్యమంత్రితో చర్చించి, హౌస్ కమిటీ వేసే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. ప్రైమరీ వెరిఫికేషన్ ప్రక్రియలో మొత్తం 25,275 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని, అందులో 7,837 ఎకరాలలో అక్రమాలు జరిగినట్లు గుర్తించినట్లు మంత్రి తెలిపారు.

# ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్!




- ❖ ఆర్ఆర్ఆర్‌ను నాడు రాష్ట్రానికి రానివ్వలేదు
- ❖ నేడు ఆయన ముందు కూర్చోలేని దుస్థితి జగన్‌ది
- ❖ కల్మషం లేని వ్యక్తి రఘురామకృష్ణరాజు పోరాడి గెలిచాడు
- ❖ ఉపసభాపతి అయ్యాడు.. ముక్కుసూటితనమే ఇబ్బందికి గురిచేసింది
- ❖ అయ్యన్నను, నన్నూ ఇబ్బంది పెట్టారు.. ఆయన చివరకు స్పీకరు అయ్యారు.
- ❖ నేను సీఎంగా గౌరవ సభలో అడుగుపెట్టా..
- ❖ శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

**అమరావతి-సూర్య వాస్తవం:** ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు ఉన్నది ఉన్నట్టు మాట్లాడతారని, కల్మషం లేకుండా ముక్కుసూటితనంగా మాట్లాడటం ఆయన నైజమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అలా నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి మాట్లాడటమే ఆయనను ఇబ్బందుల్లోకి నెట్టిందన్నారు. దేశ చరిత్రలో ఏ ఎంపీకి ఎదురుకాని దారుణమైన దుస్థితిని ఆయన చూశారని, ఆ పరిస్థితి నుంచి పోరాడి గెలిచి ఇప్పుడు ఉపసభాపతి స్థానానికి వచ్చారని సీఎం కొనియాడారు. అంతకుముందు..ఉపసభాపతిగా రఘురామ కృష్ణరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సభాపతి అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, జ్యోతుల నెహ్రూ తదితరులు ఆయనను పోడియం వద్ద సభాస్థానానికి తీసుకెళ్లి కుర్చీలో కూర్చోబెట్టారు. పోడియం పైకి వెళ్లేముందు సీఎం కాళ్లకు ఆర్ఆర్ఆర్ నమస్కారం చేశారు. ఎమ్మెల్యేలంతా సభాస్థానం వద్దకు వచ్చి ఆర్ఆర్ఆర్‌కు అభినందనలు తెలిపారు. ఆ తర్వాత సాయంత్రం వరకూ ఆయనే సభను నడిపించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఆర్ఆర్ఆర్ తాతగారు జి.ఎస.రాజు రాష్ట్ర శాసనమండలి తొలి డిప్యూటీ చైర్మన్‌గా పనిచేశారని, అప్పటినుంచే వారికి రాజకీయ వారసత్వం ఉందన్నారు. గత ప్రభుత్వంతో విభేదించిన కారణంగా సొంత ఎంపీ అని కూడా చూడకుండా జగన్ ప్రభుత్వం అత్యంత దారుణంగా ఆర్ఆర్ఆర్‌ను హింసించిందన్నారు. "సొంత ఎంపీపైనే నాటి వైసీపీ ప్రభుత్వం రాజద్రోహం కేసుపెట్టారు. 2021 మే 14న ఆర్ఆర్ఆర్ పుట్టినరోజు నాడే హైదరాబాద్ వెళ్లి బలవంతంగా అరెస్టు చేసి ఏపీకి తీసుకొచ్చారు. శని, ఆదివారాల్లో కోర్టులకు సెలవు అని కావాలనే శుక్రవారం అరెస్టు చేశారు. అరెస్టు చేసిన రోజు రాత్రి గుంటూరు సీఐడీ ఆఫీసులో ఐదుగురు ముసుగు వేసుకుని వచ్చి అత్యంత దారుణంగా కొట్టారు. లాఠీలు, రబ్బరు బెల్టులతో కాళ్లపై కొట్టారు. కోర్టులో కొట్టిన విషయం చెబితే సాయంత్రం కస్టడీకి వచ్చినప్పుడు చంపేస్తామని బెదిరించారు. అయినా భయపడకుండా కోర్టులో కాళ్లకు ఉన్న దెబ్బలను ఆర్ఆర్ఆర్ చూపించారు. కోర్టు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లమని ఆదేశిస్తే, కావాలని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడకూడా రిపోర్టులు తారుమారుచేశారు. మధ్యాహ్నం ఇవ్వాల్సిన రిపోర్టు సాయంత్రం 6గంటలకు కోర్టుకు సమర్పించారు.

ఈలోగా మేం సుప్రీంకోర్టుకు వెళ్లాం. సుప్రీంకోర్టు ఆదేశాలతో హైదరాబాద్‌లో మిలటరీ ఆసుపత్రిలో ఆర్ఆర్ఆర్ చేరారు. అక్కడ కూడా రిపోర్టులు మార్చాలని ఓ వ్యక్తి ప్రయత్నించాడు. సభ్యత కాదు కాబట్టి ఆయన పేరు ఇక్కడ చెప్పట్లేదు. అయినా అక్కడితో కక్ష ఆపకుండా ఆయనను వేధించే ప్రయత్నం చేశారు. అప్పట్లో నర్సాపురం ఎంపీగా ఉన్న ఆయనను సొంత నియోజకవర్గంలో అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణకు రానివ్వలేదు. హైదరాబాద్ నుంచి సభకు వచ్చేందుకు రైలులో బయలుదేరినా, సత్తెనపల్లి, పిడుగురాళ్ల ప్రాంతంలో బోగిని తగలబెట్టి చంపాలని ప్లాన్ చేశారని తెలిసి, అక్కడే రైలు దిగిపోయారు" అని చంద్రబాబు వివరించారు.

### పాబ్లో ఎస్కోబార్‌తోనే పోల్చగలం

'ప్రపంచ డ్రగ్స్ స్మగ్లర్ పాబ్లో ఎస్కోబార్, జగన్‌ల వ్యక్తిత్వం, ఆలోచనా విధానం ఒక్కటే. ఎస్కోబార్ ప్రపంచంలో 80శాతం డ్రగ్స్ మార్కెట్‌ను శాసించాడు. ఇక్కడ రాష్ట్రంలో జగన్ గంజాయి, డ్రగ్స్‌ను తీసుకొచ్చాడు" అని చంద్రబాబు అన్నారు. ప్రతిపక్ష హోదా తాము ఇచ్చేది కాదనీ, ప్రజలు ఇవ్వాలని సీఎం తెలిపారు. "ఆర్ఆర్ఆర్‌ను నాడు జైల్లో కొడుతుంటే సెల్‌ఫోన్‌లో జగన్ చూశారు. మొదట ఈ విషయం చెబితే మనుషులు ఇలా కూడా ఉంటారా అనుకున్నాను. కానీ నన్ను జైల్లో పెట్టి నా గదిలో సీసీ కెమెరాలు పెట్టినప్పుడు ఆర్ఆర్ఆర్ చెప్పింది నిజమేనని నిర్ధారించుకున్నాను. ఆయనను అన్ని విధాలుగా వేధించి నాడు రాష్ట్రానికి రానివ్వలేదు. నేడు ఆయన ముందు కూర్చోలేని దుస్థితి జగన్‌ది. ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్. వైనాట్ 175 అంటే చివరికి 11తో ప్రజలు సరిపెట్టారు". అన్నారు.

## అసంక్రమిక వ్యాధులను అరికట్టాలి




**చింతకొమ్మదిన్నె - సూర్య వాస్తవం:** సమాజంలో అసంక్రమిక వ్యాధులు అరికట్టడంలో భాగంగా చేపట్టిన సర్వేకార్యక్రమం పర్యవేక్షణలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు గురువారం చింతకొమ్మదిన్నె ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చింతకొమ్మదిన్నె ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పాత సచివాలయం) పరిసరాల్లో జరిగే సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తిని వెలిబుచ్చారు. ఆయన ప్రజలతో మాట్లాడుతూ సమాజంలో రక్తపోటు, మధుమేహము, కాన్సర్ లాంటి వ్యాధులు అంతర్గతంగా పెరుగుతున్నాయని వాటిని సత్వరమే గుర్తించి చికిత్స అందించడం ద్వారా ఆ వ్యాధులనుండి నివారణ పొందవచ్చుని, మరణాలను కూడా అరికట్టవచ్చుని తెలియచేసారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎపిడమియాలజిస్ట్ ఖాజా మాట్లాడుతూ ఈ సర్వే కార్యకారానికి ప్రజలుకూడా సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు డాక్టర్ రాఘువేంద్ర, డాక్టర్ సునీత, అధికారి సుకుమారన్, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

**చింతకొమ్మదిన్నె - సూర్యవాస్తవం:** 57 వ జాతీయ గ్రంథాలయం వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం చింతకొమ్మదిన్నె శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఇబ్రహీం ఆధ్వర్యంలో 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఎంపీడీవో కులాయి బాబు తొలి మాజీ ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి ప్రతిజ్ఞ చేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఎంపీడీవో గారు మాట్లాడుతూ గ్రంథాలయాలు దేవాలయాలు వంటివని గ్రంథాలయాలను అందరూ ఉపయోగించుకోవాలని గ్రంథాలయాలు మన పూర్వీకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారి కృషి వలననే మనకు ఈ రోజు గ్రంథాలయాలు మన అందుబాటులో ఉన్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ వెంకట్రామిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు, గ్రంథాలయ అధికారి పి. ఇబ్రహీం పాల్గొన్నారు. గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా 15వ తేదీ పుస్తక ప్రదర్శన 17 వ తేదీ 8, 9 వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన 18వ తేదీ 6,7 తరగతి లకు చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరుగుతాయని గ్రంథాలయ అధికారి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజు పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఇబ్రహీం, పాఠకులు పాల్గొన్నారు.

## బంగారు తాళిబొట్టు వితరణ



**దువ్వూరు - సూర్య వాస్తవం:** వైయస్సార్ కడప జిల్లా దువ్వూరు మండలం, నేలటూరు గ్రామంలో జేష్ఠది వసంతరావు ఇంట జరుగుతున్న పరిశుద్ధ వివాహం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లాతెలుగ యువత కార్యదర్శి పొలిమేర అమర్నాథరెడ్డి జేస్టాది వసంతరావు కుమారుని పెళ్లి సందర్భంగా బంగారు తాళిబొట్టు మరియు వెండి గజ్జలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా తమ రెడ్డి సంఘం కులస్థులు తమను తామే కాకుండా తమ తోటి వారిని కూడ అభివృద్ధి చెందాలని కోరుకుంటారన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘము అభివృద్ధి, పటిష్టతకు కృషి చేస్తానన్నారు. పొలిమేర అమర్నాథ్ రెడ్డికి వివాహం చేసుకుంటున్న కుటుంబాల వారు ధన్యవాదములు, కృతజ్ఞతలు తెలిపారు.

## పశువుల షెడ్లను వెంటనే పూర్తి చేయాలి



**దువ్వూరు - సూర్య వాస్తవం:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మక చేపట్టే మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి పథకంలో పశువులకు షెడ్లు నిర్మించే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాలలో ఉపాధి హామీ ఏపీఓ డాక్టర్ వసంత్ కుమార్ ఈసీ ఇందిరా ప్రియకాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 25 షెడ్లకు మంజూరయ్యాయని వెంటనే పూర్తిస్థాయిలో షెడ్లను పూర్తి చేయాలని రైతులకు వారు సూచించారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు మంజూరైన షెడ్లను వెంటనే పూర్తి చేయించాలని తెలుపుతున్నారని రైతులకు సూచించారు. షెడ్లు మొదలుపెట్టిన వారికి వారానికి ఒకసారి బిల్లులు మంజూరు అవుతాయని వారు రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## కడప పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలకు జిల్లా కలెక్టర్



**కడప - సూర్య వాస్తవం:** ట్రాఫిక్ రెవెన్యూ బందోబస్తు పైన జిల్లా అధికారులతో సమావేశం అయ్యారు. ఆవరణంలో జిల్లా అధికారులతో రూట్ మ్యాప్ గురించి సూచనలు జారీ చేశారు. ప్రతి శాఖ అధికారికి ఇక్కడ ఏమేం వసతులు అవసరం ఉందో త్వరగా రేపటి వరకు అన్ని వసతులు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆర్టీసీ ఆర్ఎం, విద్యుత్ శాఖ ఎస్ ఈ, మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య అధికారి, మైనార్టీ శాఖ అధికారి, అనేక శాఖ నుంచి వచ్చిన జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అమీర్ పీర్ దర్గా ఉరుసు
# మహోత్సవాలను విజయవంతం చేయాలి

- కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయండి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



**కడప - సూర్య వాస్తవం:** ఆస్థాన - ఏ - మగ్దుముల్లహి అమీర్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులకు ఆదేశించారు. అమీర్ పీర్ దర్గా ఉరుసు సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లపై గురువారం జిల్లా కలెక్టర్ పరిశీలించి, పలు సూచనలు జారీచేశారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఆస్థాన - ఏ - మగ్దుముల్లహి అమీర్ పీర్ దర్గా ఉరుసు మహోత్సవాలను కట్టుదిట్టమైన పకడ్బందీ భద్రతా ఏర్పాట్లతో, ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా అధికారులందరి సమన్వయం చేసుకొని విజయవంతం చేయాలని అన్నారు. ఉరుసు మహోత్సవాలకు పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో భక్తులు రానున్నారని అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఉరుసు మహోత్సవాలకు కేటాయించిన అధికారులు, సిబ్బంది 24/7 దఫలవారీగా పనిచేయాలని చెప్పారు. ఉరుసు మహోత్సవాలకు సంబంధించి ఏడు ప్రాంతాలను గుర్తించడం జరిగిందని ప్రాంతాలలో ఎమర్జెన్సీ రెస్పాన్స్, క్విక్ రెస్పాన్స్ టీములను ఏర్పాటు చేసుకోవాలని సదరు టీములలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది ఉంటారని తెలిపారు. విఐపి, వివిఐపి, సాధారణ భక్తజనం లకు వేరువేరుగా రాకపోకల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ మరియు రెవెన్యూ భద్రత ఏర్పాట్లను ఏర్పాటు చేయాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి సూచించిన ప్రాంతాలలో 24/7 వైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, 108 వాహనాలను ఉరుసు మహోత్సవాల సమీపంలో, పార్కింగ్ ప్రాతంలో ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. ఉరుసు మహోత్సవాలలో ఎక్కడను అపరిశుభ్రత కనపడకుండా పరిశుభ్రంగా ఉంచేలా, త్రాగునీటి సమస్య లేకుండా త్రాగునీటిని ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. ఏక్కడ ఎలాంటి అగ్ని ప్రమాదం జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారికి సూచించారు. ఈ నెల 17 వ తేదీన చ్ఛాదర్ సమర్పణ కార్యక్రమం ఉంటుందని, అలాగే 20 వ తేదీన పెద్ద ఎత్తున ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని సదరు కార్యక్రమాలకు అన్ని భద్రతా ఏర్పాట్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పార్కింగ్ సమస్య రాకుండా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులందరూ సమన్వయం చేసుకొని ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేయాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మాట్లాడుతూ అందరి అధికారుల సమన్వయంతో ఉరుసు మహోత్సవం విజయవంతం చేయాలని అన్నారు. విధులు కేటాయించిన అధికారులు సిబ్బంది ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త లతో పనిచేయాలని చెప్పారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్, క్విక్ రెస్పాన్స్ బృందాలు 24/7 బాధ్యతగా పనిచేయాలని చెప్పారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనించి లోటుపాట్లు రాకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. తొలుత ఆస్థాన - ఏ - మగ్దుముల్లహి అమీర్ పీర్ దర్గా ఉరుసు నిర్వాహకులు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి కి సాంప్రదాయబద్ధంగా ఘనంగా స్వాగతం పలిచారు. అనంతరం ఆస్థాన - ఏ - మగ్దుముల్లహి అమీర్ పీర్ దర్గా సందర్శించి చ్ఛాదర్ సమర్పించి, ప్రార్థనలు చేశారు. తదనంతరం అమీర్ పీర్ దర్గా ఉరుసు నిర్వాహకులు కలెక్టర్‌కు అమీర్ పీర్ దర్గా ప్రసిద్ధి, ప్రశస్థి గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కే.నాగరాజు, అగ్నిమాపక శాఖ అధికారి ధర్మారావు, సమాచార శాఖ ఎడి వేణుగోపాల్ రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం, తదితర శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# కూటమి ప్రభుత్వానిది మోసపూరిత బడ్జెట్




**చింతకొమ్మదిన్నె - సూర్య వాస్తవం:** బడ్జెట్ సమావేశాలలో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించేందుకు మోసపూరిత బడ్జెట్ను ప్రవేశపెట్టిందని వైఎస్సార్సీపీ కమలాపురం ఇన్చార్జి పి నరేన్ రామానుజుల రెడ్డి అన్నారు. గురువారం కడప నగరంలోనివైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ ఐదు నెలల తర్వాత బడ్జెట్ పెట్టి లోప భూయిష్టంగా మార్చారన్నారు. రాష్ట్ర ప్రజలకు రాబోయే రోజుల్లో పన్ను పోటు తప్పదని ఈ బడ్జెట్ వల్ల అర్థం అవుతుంది. కూటమి ఇచ్చిన హామీలు చూస్తే 4 లక్షల కోట్లు బడ్జెట్ కావాలి. వచ్చే ఆదాయం 2 లక్షల కోట్లు ఉంటే జీతాలు, అప్పులు, వడ్డీలకు 1.89 లక్షల కోట్లు కట్టాలి. ప్రకారం అప్పులు తేవాలన్న 40 వేల కోట్లకు మించి రాదు. పోనీ కేంద్రం ఈ 5 నెలల్లో ఇచ్చింది కేవలం 4 వేల కోట్లు మాత్రమేఅన్నారు. ఇక వీళ్ళు ఇచ్చిన హామీలను ఎలా నెరవేస్తారు. వనరులు లేక ప్రజలపై పన్నుల భారం తప్పదని అర్థం అవుతుందని పేర్కొన్నారు. బడ్జెట్ లో బస్సు, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిది వంటి వాటి ఊసే లేదు. తల్లికి వందనం అన్నారు. దానికి 12 వేల కోట్లు కావాల్సి ఉంటే 2వేలా కొట్లు కేటాయించారు. అంటే లబ్ధిదారులను జన్మభూమి కమిటీల ద్వారా తగ్గించేస్తారా, అన్నదాత సుఖీభవకూ అరకొర కేటాయింపులు చేశారు. ఇక ఈ రకంగా ఈ బడ్జెట్ ప్రజల కలలు తీర్చే బడ్జెట్ ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చెప్పిన సూపర్ సిక్స్ కోసం 70వేల కొట్లు కావాలి. అన్నీ సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే 1.80 లక్షల కోట్లు కావాలన్నారు. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ఎలా మోసం చేస్తుందో ప్రజలు గమనించాలన్నారు. ప్రజలు వాస్తవాలు గమనించి గళమెత్తాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# రాజకీయాల్లో శక్తివంతమైన నాయకుడు నెహ్రూ





**రాయచోటి - సూర్య వాస్తవం:** భారతదేశ తొలి ప్రధాని, భారత స్వాతంత్ర్య పోరాట నాయకుడు, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని అన్నమయ్య డిసిసి అధ్యక్షుడుగా జులభాస్కర్ అన్నారు. పండితుడుగా ప్రాచుర్యం పొందిన చాచా నెహ్రూ రచయితగా, చరిత్రకారుడుగా ఆనాడు ప్రముఖుల ప్రశంసలు అందుకున్న వ్యక్తి అని చెప్పారు. గురువారం తమ పార్టీ కార్యాలయంలో పుట్టినరోజు సందర్భంగా కాం గ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజకీయలలో శక్తివం తమైన నెహ్రూ-గాంధీ కుటుంబానికి జవహర్ లాల్ నెహ్రూ నే మూలపురుషుడు అని తెలియజేశారు. 26 జనవరి 1950 లో భారతదేశ మొదటి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాడు. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద భారత జెండాను ఎగురవేసిన మహా నాయకు డు జవహర్ లాల్ నెహ్రూ అని ఆయనకొనియాడారు. అనంతరం స్థానిక చెక్ పోస్ట్ వద్ద ఉన్న శివాలయం, సాయి బాబా గుడి దగ్గర ఉన్న అనాదలకు, 100 ఆహార పొట్లాలను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడు తూ ఈరోజు సేవా కార్యక్రమం చేయడం నాకు చాలా ఆనందంగా ఉంది ఇకమీదట దేశ నాయకుల వర్ధంతి, జయంతులకు, ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమం లో డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్, నాగ లత, చాంద్ బాషా, నవీన్, ఖాదర్ ఖాన్, హర్షద్, సాధిక్, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వమే సర్వమత సారాంశం

**వైయస్సార్ జిల్లా - సూర్య వాస్తవం:** మానవత్వమే సర్వమత సారశం అని చాటి చెప్పిన హజరత్ సూఫీ సర్ మస్త్ సాని చిల్లాకష్ ఖ్వాజా ఆరిఫుల్లా మొహమ్మద్ మహమ్మద్ హుస్సేన్ ఖాదిరి గురువు జ్ఞాపకార్థం ప్రతి ఏడాది లాగే ఈ నెల 15 నుండి 21 వ తేదీ వరకు జరుగనున్న "అమీన్ పీర్ దర్గా" ఉరుసు ఉత్సవాలను కులమతాలకు అతీతంగా.. కలిసికట్టుగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం స్థానిక అమీన్ పీర్ దర్గా లోని ముషాయిరా హాల్ నందు అమీన్ పీర్ దర్గా ఉత్సవాలపై.. అమీన్ పీర్ దర్గా కమిటీ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ సభ్యులు మాట్లాడుతూ... శతాబ్దాల నాటి చరిత్ర కలిగిన ప్రఖ్యాత అమీన్ పీర్ దర్గా ఉత్సవాలను.. మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా. ఉరుసు ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ముందస్తు ప్రణాళికతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతోందన్నారు. అందుకోసం అమీన్ పీర్ దర్గా (పెద్ద దర్గా) కమిటీ సభ్యులు, జిల్లా యంత్రాంగం అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. మత సామరస్యానికి ప్రతీక అయిన అమీన్ పీర్ దర్గాను.. కుల మతాలకు అతీతంగా అందరూ భాగస్వాములై ఉత్సవాల్లో పాల్గొనడం ఇక్కడి ఆనవాయితీ అన్నారు. అమీన్ పీర్ దర్గా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా



యంత్రాంగం కూడా భాగస్వామ్యం అయ్యేందుకు జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వడం కూడా జరిగిందన్నారు. నగర పాలక సంస్థ వారి సహకారంతో.. పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమలను చేపట్టడం జరుగుతోందన్నారు. ఉరుసు ఉత్సవ ఏర్పాట్లను.. ఒక్కొశాఖ జిల్లా అధికారుల పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.

ఉరుసు మహోత్సవాల్లో ప్రధాన కార్యక్రమాలు **మొదటి రోజు:** 15 వ తేది (శుక్రవారం) ఉదయం 8 గంటలకు సర్ గిరోలు, షఖీర్లు , ఊరేగింపుతో దర్గా షరీఫ్ షరీఫ్ నకు వచ్చి చదివింపులు ఇచ్చి వారి స్తానంలో బిస్తర్ చేయుదురు. **రెండవ రోజు:** 16 వ తేదీ (శనివారం) గంధం కార్యక్రమంలో భాగంగా ఉదయం.. దర్గా నుండి బాదుల్లా సాహెబ్ మకాన్ వరకుపకీర్ల ఊరేగింపు సాంగ్యం, సాయంత్రం పీఠాధిపతులు దివ్యాసనం, ధ్యాన తపస్సు. రాత్రి గంధం ఊరేగింపు, ఫేతెహ సమర్పణ, ఖవాలీ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. **మూడవ రోజు:** 17 వ తేదీ (ఆదివారం) ఇదార-యే-అమీనియా చిస్తీయా వార్షిక నివేదిక. రాత్రి 9 గంటలకు ఉరుసు మహోత్సవం, ఎద్దుకబండ్ల చౌహరీ ఖలీఫల చాందినీ, గంధం ఊరేగింపు, చదివింపులు, ఖవాలీ మొదలైన పవిత్ర పుణ్య కార్యక్రమాలు జరుగుతాయి. **నాల్గవ రోజు:** 18 వ తేదీ (సోమవారం) తహలీల్ ఫతేహ ఉత్సవంలో భాగంగా.. ప్రసాద సమర్పణ, సంబందిత హెూలీ ప్రార్ధనలు, రాత్రి ప్రముఖ విద్వాంసులతో 80వ ఉర్దూ కవి సమ్మేళనం (ముషాయిరా) జరుగుతుంది. **ఐదవ రోజు:** 19 వ తేదీ (మంగళవారం) రాత్రి 10గంటల నుండి తెల్లవారి 3 గంటల వరకు సమాఖానీ సజ్జదనషీన్ పీఠాధిపతి వారి ఆధ్వర్యంలో ఖవాలీ, ఖురాన్ పఠనం, తదితర కార్యక్రమాలు. **ఆరవ రోజు:** 20 వ తేదీ (బుధవారం) ఫకీర్లతో పీఠాధిపతులు వారి వాటర్ గండిలోని హాజరత్ మస్తాన్ స్వామివారి దర్శనం, జెండా ప్రతిష్ట, చదివింపులు. **చివరి రోజు:** 21 వ తేదీ (గురువారం) ఫకీర్ల సంఘాలకు జర్రా ప్రసాదం, దస్స ఆవాజ్, పండితులు, విద్వాంసులు, యాత్రికులు, భక్తుల తిరుగు ప్రయాణం. ఈ కార్యక్రమంలో... అమీన్ పీర్ దర్గా చీఫ్ ముజావర్ అమిరుద్దీన్, అమీన్ పీర్ దర్గా అడ్వైజర్ కుతుబుద్దీన్, అమీన్ పీర్ దర్గా సెక్రటరీ సయ్యద్ గౌస్, ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు, దర్గా మత పెద్దలు, శిశ్య కోటి బృందం తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రతిఒక్కరి సహకారం తప్పనిసరి

**లక్కిరెడ్డిపల్లె - సూర్య వాస్తవం:** ప్రణాళిక బద్ధంగా గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం తప్పనిసరి అని లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జడ్పిటిసి రమాదేవిలు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు,వివిధ శాఖల అధికారులు, ఉపసర్పంచ్ లతో కలిసి గ్రామాల అభివృద్ధి పై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనే భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి అన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలంలో తీవ్ర వర్షాభావం నెలకొన్న పరిస్థితుల్లో తాగునీటి ఇబ్బందులు అధికంగా ఉన్నందున సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ చూపి పంచాయతీ నిధులను దుర్వినియోగం కాకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాలలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. సీజనల్ వ్యాధులు రోజురోజుకీ అధికమవుతున్నందున గ్రామాలలో మురుగునీరు నిలవ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అటు పంచాయతీ అధికారులు,సర్పంచులు,ఉప సర్పంచులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బాలల దినోత్సవం



సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, జవహర్ లాల్ నెహ్రూ, తెలుగు తల్లి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించి వారిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డన్న, ఎంఈవో చక్రే నాయక్,కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, మండల ఉపాధ్యక్షులు నాగలక్ష్మి సుబ్బరాయుడు, సర్పంచులు వెంకట నారాయణరెడ్డి, సిద్ధక నాగిరెడ్డి, రామచంద్రయ్య, మహేంద్ర బాబు, మోహన్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, సంధ్యారాణి, కేశవయ్య, గడ్డం కళ్యాణి ప్రభాకర్ రెడ్డి, చేంద్రాయుడు, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీనారాయణ, దస్తగిరి, ఉదయగిరి ఎల్లమ్మ, జగన్మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# భూమిరెడ్డి రవికళ్యాణ్‌కి జాతీయ తెలుగు వెలుగు రత్న అవార్డు

**మైదుకూరు - సూర్య వాస్తవం:** విశాఖపట్నంలో జాతీయ తెలుగు వెలుగు రత్న అవార్డు అందుకోబోతున్నట్లు భూమిరెడ్డి రవి కళ్యాణ్ తెలిపారు. కడప జిల్లా మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన భూమిరెడ్డి మనోహర్, భూమిరెడ్డి మార్తమ్మ దంపతుల యొక్క ఐదు మంది సంతానంలో చివరి కుమారుడు భూమిరెడ్డి రవి కళ్యాణ్ ఈయన మైదుకూరు లోని వనిపెట్ రోడ్ లో ఉన్నటువంటి శ్రీ బాల శివ యోగేంద్ర మహారాజు డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ గా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా తెలుగు లెక్చరర్ గా, కాజీపేట సాహిత్య డిగ్రీ కళాశాలలో తెలుగు లెక్చరర్ గా ప్రవేట్ ఉద్యోగ బాధ్యతలు చేపడుతూ అటు సమాజ సేవలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్గా శ్రీ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ జాన్ సెక్రటరీగా సేవా కార్యక్రమాలు చేపడుతూ ఇప్పటికీ 23 సార్లు బ్లడ్ డొనేషన్ చేశారని కళా, సామాజిక సేవ రంగాలలో తనదైన శైలిని ప్రదర్శిస్తూ జాతీయ పునర్నిర్మాణంలో భాగంగా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తన సేవలను గుర్తించి విశాఖపట్నం విశాఖ రత్న కళా పరిషత్, దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ వ్యవస్థాపకులు కళా భూషణ్ పిఏ భాస్కరరావు, దాసరి కల్చరల్ అకాడమీ అధ్యక్షులు శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు మన ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సినీ నటులు డాక్టర్ కుమార్ నాయక్



ఆధ్వర్యంలో జాతీయ తెలుగు వెలుగు రత్న అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పథకం ఉత్తమ పిఓ అవార్డు గ్రహీత ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, మహారాష్ట్ర ముంబై నేతాజీ సుభాష్ చంద్రబోస్ రాష్ట్ర రత్న అవార్డు రహిత భూమిరెడ్డి రవి కళ్యాణ్ మాట్లాడుతూ తెలుగువారు గర్వించదగ్గ మహానటుడు తెలుగువారి కీర్తిని ప్రపంచ దేశాలలో చాటి చెప్పిన తెలుగు మహానీయుడు మన నటరత్న డాక్టర్ నందమూరి తారక రామారావు తెలుగు సినీ దర్శకుడిగా ప్రపంచ ఖ్యాతిగాంచిన ప్రపంచంలో 151 చిత్రాలకు దర్శకత్వం వహించి గిన్నిస్ రికార్డు సాధించిన ఏకైక సినీదర్శకుడు దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణరావు తెలుగు వారి ఆశీస్సులతో ఈ బృహత్తరమైన కార్యక్రమం దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ మరియు విశాఖరత్న కళాపరిషత్ వ్యవస్థాపకులు తెలుగు సినీ దర్శకులు మరియు దర్శకరత్న దాసరి ప్రియ శిష్యులు కళాభూషణ్ డాక్టర్ పి.ఏ భాస్కరరావు సారధ్యంలో ప్రపంచంలోని తెలుగు వారందరిని గౌరవించుకునే మహోన్నతమైన కార్యక్రమము వివిధ రంగాలలో నిష్టాతులైన వారికి వయసుతో సంబంధం లేకుండా జాతీయ తెలుగు వెలుగు రత్న అవార్డులు2024 ప్రధానం చేస్తున్నట్లు ఆంధ్ర తెలంగాణ ఒరిస్సా ఇతర రాష్ట్రాలకు చెందిన తెలుగువారు అనేక రంగాలలో ప్రతిభావంతులు కళా, సేవ, వైద్య విద్య ,సాహిత్య, భరతనాట్యం కూచిపూడి జానపదం నాటకం క్రీడారంగాలలో అనేక రంగాలలో ప్రతిభావంతులకు ఈ యొక్క పురస్కార అవార్డు నవంబర్ 16వ తేదీ విశాఖపట్నంలోని బి వి కే కాలేజ్ ఎదురుగా జిల్లా పౌర గ్రంథాలయం ఏసి ఆడిటోరియం లో భూమిరెడ్డి రవి కళ్యాణ్ కు దాసరి నారాయణరావు కల్చర్ అకాడమీ విశాఖ రత్న కళాపరిషత్ కళా సంబరాలు 2024 సందర్భంగా అవార్డు అందుకు పోతున్నారని తెలిపారు.

# ఘనంగా బాలల దినోత్సవం వేడుకలు

**కడప - సూర్య వాస్తవం:** కడప జిల్లా నగర పాలక ప్రాథమికోన్నత పాఠశాల, ఉర్దూ బుచ్చర్ స్ట్రీట్ నందు పాఠశాల హెడ్మాష్టర్ దావూద్ అధ్యక్షతన చిల్డ్రన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించడమైనది.ఇందులో భాగంగా, 28 వ డివిజన్ యువనాయకులు బి.అబ్దుల్లా, అబూజర్ బాలలదినోత్సవ వేడుకలలో పాల్గొని పిల్లలకు బాలలదినోత్సవం గురించి దాని ప్రాముఖ్యత గురించి వివరించారు.నేటి బాలలు రేపటి పౌరులు భారత దేశ మాజీ ప్రధాన మంత్రి జవహర్.లాల్ నెహ్రూ జన్మదినం పురస్కరించుకొని మనం బాలల దినోత్సవం జరుపుకుంటున్నామని ఆయన ఏర్పరిచిన మార్గంలో పయనించినపుడే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. ఆనాతరం నెహ్రూజి చిత్ర పటానికి పుల మాల



వేసి నివాళులు అర్పించారు ఉపన్యాసంతో విద్యార్థులను అలరించిరి. ప్రాధానోపాధ్యాయులు బాలల దినోత్సవం గురించి విద్యార్థులకు తెలియజేసిరి. తరువాత ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు బాలల దినోత్సవం గురించి పిల్లలకు వారి వారి ఉపాన్యాసాల ద్వారా విద్యార్థులను ఆనందింపజేసిరి. తరువాత విద్యార్థులు ఆటల పోటీలో ప్రథమ బహుమతిని పొందిన విద్యార్థులకు యువజన నాయకులైన బి.అబ్దుల్లా అబూజర్, ప్రధానోపాధ్యాయులు షేక్ దావూద్, ఉపాధ్యాయులు బహుమతులు ప్రధానం చేసిరి.తరువాత పిల్లలకి మితాయిలు పంచి, జాతీయ గీతంతో సమావేశాన్ని ముగించడమైనది. తదుపరి స్కూల్ హెడ్ మాస్టర్ దావుద్ బాలల దినోత్సవం గురించి వివరించారు. అబుజర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఉర్దూ హైస్కూల్లో బాలల దినోత్సవం



**కడప - సూర్య వాస్తవం:** మండలంలోని మూలవంక జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల లో చాచా నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సభ కు అధ్యక్షత పాఠశాల హెచ్ఎం మహమ్మద్ ఇర్షాద్ మాట్లాడుతూ విద్యార్థులు చాచా నెహ్రూ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశి నివాళు లర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయలైన సత్తార్ ఫైజి, ఖదీరుద్దీన్ లను ప్రత్యేక బహుమతులు అందజేశారు. వక్తృత్వ పోటీలు, ఆటపాటల పోటీలు, చిత్ర లేఖన పోటీల 36 మంది విజేతలకు బహుమతులు ప్రశంస పత్రాలు పరీక్షల్లో ప్రతిభ చూపిన 20 మంది విద్యార్థులకు మెడల్స్ ప్రదానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉర్దూ కళాకారుడు మగ్బుల్ అహ్మద్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులు గా ఎదగాలని అన్నారు. పాఠశాల బోధన సిబ్బంది సతీష్, సత్తార్ ఫైజి, ఖదీరుద్దీన్, విద్య కిరన్, సాబిరా పర్వీన్లు పాల్గొని ప్రసంగించారు.

# జాతీయ న్యాయ సేవాధికార సంస్థ





**దువ్వూరు - సూర్య వాస్తవం:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అందరికీ అందుబాటులో న్యాయానికి కృషి చేస్తుందని మండల తహసిల్దార్ అక్బల్ భాష పేర్కొన్నారు. గురువారము మండల కేంద్రమైన దువ్వూరులోని తహసిల్దార్ కార్యాలయం ఆవరణం నందు రెవిన్యూ సిబ్బందితో కలిసి జాతీయ న్యాయ సేవాధికార సంస్థ పోస్టర్లను విడుదలచేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ అక్బల్ భాష మాట్లాడుతూ మండలంలో ఎవరైనా ఉచిత న్యాయ సహాయం కోసం 15100 ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు. అలాగే ఆన్ లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకుని సంప్రదించవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తహసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్లు వేణుగోపాల్, కరిముల్లా రెవెన్యూ ఇన్స్పెక్టర్ జాన్సన్ దువ్వూరు వీఆర్వో మునిస్వామి పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరికీ ఉచితంగా వైద్య పరీక్షలు





**దువ్వూరు - సూర్య వాస్తవం:** మండలంలో అసంక్రమిక వ్యాధులను అరికట్టాలని ఎన్‌సిడి 3.0 సర్వే చేస్తున్నట్లు చింతకుంట ప్రాథమిక వైద్యాధికారులు డాక్టర్ వికసిత, డాక్టర్ రోసిణిలు పేర్కొన్నారు. మండలంలోని చిన్న సింగన పల్లె, గుడిపాడు, చింతకుంట పంచాయతీలలో ప్రతి ఒక్కరి ఇంటి వద్దకు వెళ్లి 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చింతకుంట ప్రాథమిక వైద్యాధికారులు డాక్టర్ వికసిత, డాక్టర్ రోషిణి లు తెలిపారు.గురువారం చింతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో గుడిపాడు, చింతకుంట గ్రామంలో డాక్టర్ వికసిత, చిన్న సింగన పల్లె గ్రామంలో డాక్టర్ రోషిణిల ఆధ్వర్యంలో సచివాలయ పరిధిలోని సిహెచ్వోలు ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి 18 సంవత్సరాలు వయసు దాటిన వారికి బిపి, షుగర్, ఎత్తు, బరువు, హిమాగ్లోబిన్, క్యాన్సర్ వంటి పరీక్షలు మరియు ఇతర అవసరమైన పరీక్షలు చేశామని తెలిపారు. జబ్బు రాకముందే జాగ్రత్తలు పాటించాలని డాక్టర్లు సూచించారు. మొబైల్ నందు ఎన్ సిడి, సిడి యాప్ ఏ విధంగా పనిచేస్తున్నది ఓపెన్ చేసి పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పి.రాజగోపాల్, సిహెచ్ఓ విజయకుమారి, సచివాలయ సిహెచ్ఓ హరి చందన, ఏఎన్ఎం తులసి కుమారి, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య పరీక్షలు




**ములకలచెరువు - సూర్య వాస్తవం:** ములకలచెరువు హీరో షోరూం సమీపంలో గురువారం తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పోతుల సాయినాథ్ ఆధ్వర్యంలో డాక్టర్ అగ్రవాల్ దృష్టి కంటి హాస్పిటల్ మదనపల్లి వారి సారధ్యంలో డాక్టర్ ఎన్ వంశీధర్ రెడ్డి, అభిలాష్, రాజశేఖర్, ఇమాన్యుల్, 100 మందికి పైగా ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 48 మందికి ఆపరేషన్ అవసరమని నిర్ధారించారు. 34 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. మిగిలిన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు హీరో షోరూం సూరి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, రెడ్డి, శంకర, పవన్ రెడ్డి, సుబ్బు, కామాక్షి అంజి, జస్వంత్, టీడీపీ మండలాధ్యక్షుడు పాలగిరి సిద్ధ, మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, రాజంపేట పార్లమెంట్ నాయి బ్రాహ్మణ అధ్యక్షులు కేశవులు, సుధాకర్ నాయుడు, ఉమా శంకర్, ప్రతాప్ నాయుడు భాస్కర్ నాయుడు, ప్రేమ్ ప్రతాప్, రమణప్ప తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని నెహ్రూకు ఘన నివాళి



**హిందూపురం - సూర్య వాస్తవం:** శ్రీ సత్య సాయి జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు శ్రీ యం.యచ్ ఇనాయతుల్లా ఆధ్వర్యంలో గురువారం భారత దేశ మాజీ ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఘన నివాళి అర్పించారు. స్థానిక పట్టణంలోని పెనుకొండ రోడ్డులో ఉన్న నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఇనాయతుల్లా మాట్లాడుతూ...... స్వాతంత్ర్య ఉద్యమ నాయకుడు, దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించామన్నారు. నెహ్రూ శాస్త్రీయ పురోగతి, సమానత్వం, విద్య, ఆధునికత యొక్క మార్గాన్ని నడిపించాడన్నారు. పారిశ్రామికీకరణ పితామహుడిగా, పంచవర్ష ప్రణాళికల స్థాపకుడిగా నవ భారతదేశాన్ని నిర్మించే గొప్ప పనికి పునాది వేశారని కొనియాడారు. పిల్లలే దేశ భవిష్యత్తు అని నమ్మి వారిలో స్ఫూర్తి నింపేందుకు నిరంతరం శ్రమించారు. దేశం గర్వించదగ్గ నాయకుడు పండిట్ నెహ్రూ జీవితం, విజయాలు మనందరికీ స్ఫూర్తినిచ్చాయన్నారు. నెహ్రూ జయంతిని బాలల దినోత్సవం రోజున శుభాకాంక్షలు తెలుపడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు నెహ్రూ అభిమానులు, పట్టణ ప్రజలు తది తరులు పాల్గోన్నారు.

## అహుడ చైర్మన్‌కి జనసేన నాయకుల స్వాగతం



**పామిడి - సూర్య వాస్తవం:** పామిడి పట్టణంలో జనసేన నాయకులు అహుడ చైర్మన్‌గా ఎన్నికైన టిసి వరుణ్ మొట్టమొదటిసారిగా రోడ్డు మార్గాన అనంతపూర్ జిల్లాకి విచ్చేసిన సందర్భంగా బాటసుంకులమ్మ గుడి దగ్గర పూజలు చేయించి రోడ్డు మార్గాల పామిడి పట్టణంలో స్వాగతం పలికి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి జనసేన నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ ర్యాలీలో పాల్గొనడం జరిగినది అదేవిధంగా జనసేన పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు వచ్చినా నేనుంటానని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గుంతకల్ నియోజకవర్గం సమన్వయకర్త వాసగిరి మణికంఠ జనసేన పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు సూర్యనారాయణ, వడ్డే రాము, షేక్షావలి, శరత్ కుమార్, నక్కల రామాంజనేయులు, వీర ప్రతాప్, రాజు, మురళి, నవీన్, రవితేజ, నాగేంద్ర, సందీప్ కుమార్, రమేష్, మధ్య నాయక్, తదితరులు పాల్గోన్నారు.


## భక్తుల భద్రతకు ప్రాధాన్యం




**కదిరి - సూర్య వాస్తవం:** ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం ఎంత ముఖ్యమో.. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడిపి వారిని భద్రంగా ఆలయాల సందర్శన అనంతరం తిరిగి స్వగ్రామలకు చేర్చడం కూడా తమకు అత్యంత ప్రాధాన్య అంశమని శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ఆర్టీసీ డిపో మేనేజర్ బి.మైనుద్దీన్ తెలిపారు. కదిరి డిపో నుంచి మలమీదపల్లి మీదుగా అరుణాచలంకు ఒక ఎక్స్ ప్రెస్ బస్సు, కదిరి నుంచి అరుణాచలంకు మరో సూపర్ లగజరీ బస్సు స్పెషల్ సర్వీసుగా శివ భక్తుల కోసం పంపినట్లు ఆయన వివరించారు. భక్తుల కోరిక మేరకు శైవ క్షేత్రాలతో పాటు అన్ని ప్రాంతాలకు స్పెషల్ బస్సులు నడపడానికి తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఆలయాల సందర్శనకు వెల్లదలచిన భక్తులకు సురక్షితంగా, సౌకర్యవంతంగా, ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రయాణం సాగేలా తాము చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విహార యాత్రలకు వెల్లదలచుకున్న వారి కోరిక మేరకూ తాము ప్రత్యేక బస్సులు నడపుతామని ప్రకటించారు. శైవ క్షేత్రాలు, ఇతర ఆలయాల సందర్శనకు, విహార యాత్రలకు అవసరమైన స్పెషల్ బస్సుల కోసం సెల్: 99592 25892 నంబర్‌లో సంప్రదించాలని డిపో మేనేజర్ మైనుద్దీన్ సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ హరిత, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలి

**- జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ**



**అనంతపురం బ్యూరో - సూర్య వాస్తవం:** అనంతపురం - హిందూపూర్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ద్వారా నిర్మించిఉన్న ధర్మవరం మండలం కునుతూరు గ్రామం వద్దనున్న లే అవుట్ లో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. గురువారం శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం మండలం కునుతూరు గ్రామం వద్ద అనంతపురం - హిందూపూర్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ద్వారా ఏర్పాటు చేస్తున్న లే అవుట్ ను జెసి పరిశీలించారు. ఈ సందర్భంగా లేఅవుట్ లోని రోడ్లను పరిశీలించి రోడ్ల యొక్క విస్తీర్ణము, నాణ్యత మరియు వాటిలో వాడిన మెటీరియల్ గురించి జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్ లో కల్వర్టులు, డ్రైనేజ్ వ్యవస్థ యొక్క పనులను నాణ్యతగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ గౌరీ శంకర్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దుశ్యంత్, తదితరులు పాల్గొన్నారు.

## "అహుడ చైర్మన్" టి.సి వరుణ్‌కి ఘన స్వాగతం



**గుత్తి - సూర్య వాస్తవం:** గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం సూచనలు మేరకు ఆయన సోదరుడు గుత్తి మండలం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ జనసేన పార్టీ సమన్వయకర్త వాసగిరి మణికంఠ, గుత్తి పట్టణం సమీపంలో కొలువైన గుత్తి బాట సుంకులమ్మ అమ్మవారి ఆలయం వద్ద, ఉమ్మడి అనంతపురం జిల్లా జనసేన పార్టీ నాయకుడు అహుడ చైర్మన్ టీ.సి వరుణ్ ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, బిజెపి కార్యకర్తలు జనసేన సైనికులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ పేరుతో చీటింగ్



**అనంతపురం - సూర్య వాస్తవం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అనంతపురం కాంగ్రెస్ ఇంచార్జ్ దాదా గాంధీ స్పందించారు. ఇది కోతల బడ్జెట్ అని అభివర్ణించారు. బడ్జెట్‌లో అంకెల గారడీ తప్పితే ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బడ్జెట్ సందర్భంగా ప్రజలకు 'సూపర్ మోసం' చేసిందన్నారు. మేనిఫెస్టోలో ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయంగా ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పి.. బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేశారని విమర్శించారు. వాస్తవానికి రూ.10 వేల కోట్లకు పైగా నిధులు అవసరం అవుతుంటే రూ.4500 కోట్లు మాత్రమే కేటాయింపులు చేసి రైతాంగాన్ని మోసం చేశారని తెలిపారు. ఇక ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతిగా ఇస్తామని చెప్పి బడ్జెట్‌లో నిరుద్యోగులకు పంగనామాలు పెట్టారని విమర్శించారు. ఆడబిడ్డ నిధి పథకం కింద 19 ఏళ్ల నుంచి 59 ఏళ్లు ఉన్న మహిళలకు నెలకు రూ.1500 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ బడ్జెట్‌లో ఈ పథకం ఆచూకీ కనిపించలేదన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో బడికి వెళ్లే ప్రతి పిల్లాడికి రూ.15 వేలు ఇస్తామన్నారని, కానీ బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి కేవలం రూ.2491 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. వాస్తవానికి తల్లికి వందనం పథకానికి రూ.10 వేల కోట్లకు పైగా నిధులు అవసరం అవుతాయన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్న హామీ కూడా అటకెక్కిందని, కేవలం బడ్జెట్‌లో ప్రకటనకు మాత్రమే పరిమితం అయ్యారన్నారు. వైఎస్ జగన్ హయాంలో అన్ని రంగాలకు ప్రోత్సహం అందితే.. ఈ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మోసం జరిగిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టింది బడ్జెట్ పత్రం కాదని, చంద్రబాబు ప్రశంసా పత్రమని తెలిపారు. ఆత్మస్తుతి.. పరనిందలా బడ్జెట్ ప్రసంగాలు సాగాయని పేర్కొన్నారు. చంద్రబాబును కీర్తించడం, గత ప్రభుత్వాన్ని విమర్శించడంపైనే దృష్టిపెట్టారని.. ఈ బడ్జెట్ వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. అనంతపురము జిల్లా అతివృష్టి అనావృష్టి వల్ల నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలి. హెచ్ ఎల్ సి ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలి పీఏబీఆర్ కుడి కాల్వ ద్వారా 49 చెరువులు నింపి చివరి ఆయకట్టుకు నీరు ఇవ్వాలి. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం మూడు లక్షల 45 వేల ఎకరాలు, రాయలసీమ జిల్లాలకు జీవనాడి అయినటువంటి కాలువను రెండింతలు వెడల్పు చేసి 6 వేల క్యూసెక్కులకు పెంచాలి. హంద్రీనీవా నుండి ,హెచ్ ఎల్ సి కి నీరు మళ్లించి చివరి ఆయకట్టుకు నీరు ఇవ్వాలన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించండి




**రాప్తాడు - సూర్య వాస్తవం:** అధిక వర్షాలు వలన పంటలు నష్టపోయిన రైతులకు,ఇల్లు దెబ్బ తిన్న కుటుంబాలకు, గొర్రె కాపరులకు నష్ట పరిహారం అందించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సిపిఎం.పార్టీ ప్రాంతీయ కార్యదర్శి టి. రామాంజనేయులు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై రాప్తాడు మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యక్రమం ముందు సిపిఎం.పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.అనంతరం తాసీల్దార్ విజయ్ కుమారి కి వినతిపత్రం అందించారు. ఈ సంధర్భంగా సిపిఎం.పార్టీ ప్రాంతీయ కార్యదర్శి టి. రామాంజనేయులు మాట్లాడుతూ మండలంలోని బండమీదపల్లి గ్రామంలో గత నెలలో అధికవర్షాల వలన వల్ల 70 గొర్రెలు నీట మునగి చనిపోయినాయి. మండల స్థాయి నుండి గ్రామీణ ప్రాంతాల వరకు రైతుల పంట నష్టాలు, కరువు కాటకాల వలన అనంతపురం రూరల్ రాప్తాడు, మండలాలు కరువు జిల్లాలుగా ప్రకటించారు.అయితే రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులకు, వరద బాధితులకు ఇన్పుట్ సబ్సిడి, ఇన్సూరెన్స్ ప్రకటించడంలోను, సహాయం చేయడంలోను ఎందుకు నిర్లక్ష్యం చేస్తోంది అని ప్రశ్నించారు. రైతాంగాన్ని ఆదుకుంటామని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం వెంటనే రైతులకు నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల పరిపాలన పట్ల, పెరిగిన నిత్యవసర ధరల పట్ల ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఇందులో భాగంగానే పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని,స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లు నిలిపివేయాలని, కూరగాయలు నూనెలు ధరలు తగ్గించాలని, మద్యం షాపులు, బెల్ట్ షాపులకు, సమయాలు పెంచడం నియంత్రించాలి అని చెప్పారు. కౌలు రైతుల విషయంలో వాస్తవ సాగుదారులను గుర్తించాలని, టిట్కో ఇళ్ళ సమస్యలను, స్మశాన సమస్యలను, వక్ఫ్ ఆస్తులపై పెత్తందారుల కోసం కేంద్రం తెచ్చిన చట్టాలను రద్దు చేయాలి అని తెలిపారు కేంద్రం జమిలి ఎన్నికలను విరమించుకోవాలని, నిరుద్యోగ సమస్యను తగ్గించడానికి గ్రూప్ 1 గ్రూప్ 2 ఆయా శాఖలలో ఉద్యోగాలను భర్తీ చేయాలని, భవన నిర్మాణ కార్మికుల పనుల కోసం, ఉపాధి అవకాశాల కోసం, ఉచిత ఇసుకను ఇవ్వాలని, దళితులపై, మహిళలపై, అత్యాచారాలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కమిటీ సభ్యుడు ఎం. పోతలయ్య, బి.మధు ప్రసాద్, వి.నాగేష్,బి. చంద్రశేఖర్ రెడ్డి పి. సుబ్బిరెడ్డి, గోవర్ధన్ రైతులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై పోరాటం



**అనంతపురం బ్యూరో - సూర్య వాస్తవం:** రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాన్ని కొనసాగిస్తామని జర్నలిస్టులకు కనీస సౌకర్యాలు ఇళ్లపట్టాలు ఇల్లు నిర్మించి ఇవ్వాలని పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ రాబోవు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని జర్నలిస్టులందరూ సహకరించాలని మచ్చా రామలింగారెడ్డి రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలోని ప్రెస్ క్లబ్ నందు ఏపీడబ్ల్యూజేయు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి పాల్గొని లాంచనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకి రవి ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో విజయరాజు, జానీ, షాకీర్, లోకరాజు, సాయినాథ్ రెడ్డి, ఇతర జర్నలిస్టుల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి రాష్ట్ర అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు వెంటనే మంజూరు చేయాలని ఇందుకోసం కొత్త జీవోను విడుదల చేయాలని నిబంధనలు సడలించి యూట్యూబ్ ఛానల్స్ చిన్న పత్రికలు అందరికీ అక్రిడేషన్లు ఇవ్వాలని సీనియర్ జర్నలిస్టులు జర్నలిస్టులకు ఇవ్వాలని కోరారు. అన్ని కులాల మాదిరిగానే జర్నలిస్టులను ప్రత్యేకంగా గుర్తించి జర్నలిస్టులకు ప్రత్యేక కార్పొరేషన్ను ఏర్పాటు చేసి జర్నలిస్టు కుటుంబాలకు, పిల్లలకు ఉన్నత చదువులకు ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు మహిళలకు లోన్ల సౌకర్యం కల్పించాలని కోరారు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి జర్నలిస్టులకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు జీవో విడుదల చేయాలని అన్నారు. వర్కింగ్ జర్నలిస్టు పిల్లలందరికీ అక్రిడేషన్ తో సంబంధం లేకుండా ఉచిత విద్యను అన్ని కార్పరేట్ స్కూల్లో అందజేయాలని ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేయాలని మచ్చా రామలింగారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టుల ఐక్యంగా జర్నలిస్టుల సమస్యల కోసం అందర్నీ కలుపుకొని పోరాటం కొనసాగిస్తామని జర్నలిస్టులందరూ సహకరించాలని మచ్చా కోరారు. అనంతపురం జిల్లాలో వచ్చే నెల మొదటి వారంలో సభ్యత్వ నమోదు అనంతరం జిల్లా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా కమిటీకి ఎన్నికలు నిర్వహించి నూతనంగా కమిటీని ఏర్పాటు చేస్తామని మచ్చా అన్నారు. సమావేశ అనంతరం జర్నలిస్టులకు సభ్యత్వం రాష్ట్ర అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి అందజేశారు ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు రాజు, రమేష్, జి.శ్రీధర్, మొహమ్మద్ రఫీ, త్యాగరాజు, తిరుపతయ్య దినేష్, ఉపేంద్ర, విజయ్, సాయికుమార్, జె.నాగరాజు, జి.రాము పెద్ద ఎత్తున ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు చిన్న పత్రికలు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# నార్పల ఎరువుల దుకాణాలు తనిఖీ





**నార్పల - సూర్య వాస్తవం:** మండలంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ అధికారి కళ్యాణదుర్గం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎల్లప్ప ఆధ్వర్యంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి సి చన్న వీరస్వామి తనిఖీ చేశారు. గురువారం తనిఖీ అధికారితోపాటు స్థానిక మండల వ్యవసాయ అధికారి పరిశీలించి ఎరువుల దుకాణదారులకు ఎరువుల విక్రయంపై సలహాలను సూచనలను ఆదేశించారు. రబీ 2024-25 సీజన్లో వరి, మొక్కజొన్న, వేరుశనగ, పంటలు రైతులు సాగు చేస్తున్నరన్నారు. రైతులకు కావలసిన ఎరువులను ఎరువుల దుకాణంలో, రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచాలన్నారు. వాటిని ఎమ్మార్పీ ధరలకు మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. ఎరువులు తీసుకున్న ప్రతి రైతుకు బిల్లు కచ్చితంగా అందజేయాలన్నారు. ప్రతి దుకాణంలో ఎరువుల స్టాకు ఎంత ఉంది అనేది ప్రతిరోజు స్టాకు బోర్డులో కనబరచాలన్నారు. మార్కెట్ ధరల కన్నా ఎరువులు ఎక్కువగా అమ్మిన, ఫిర్యాదులువచ్చినా సంబంధిత ఎరువుల దుకాణదారుల మీద చర్యలు తీసుకుంట మన్నారు. ఎరువుల దుకాణదారులు ఎవరైనా ఎమ్మార్పీ ధరల కన్నా ఎక్కువగా రైతులకు అమ్మినట్లైతే సంబంధిత రైతులు స్థానిక వ్యవసాయ మండల అధికారికి ఫిర్యాదు అందజేయాలనీ మండల వ్యవసాయ అధికారి తెలిపారు. ఈకార్యక్రమంలో నార్పల రైతు సేవ కేంద్రం సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

# గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు

**అనంతపురం - సూర్య వాస్తవం:** మహిళా, బాలల గ్రంథాలయం అనంతపురం గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు ప్రారంభించి, బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. **బాలల దినోత్సవ నేపథ్యం:** నవంబర్ 14 వచ్చింది బాలలకు బోలెడు సందడి తెచ్చింది. ఈ రోజంటే పిల్లలకు పండగ లాంటిది. నవంబర్ 14న బాలలదినోత్సవాన్ని దేశవ్యాప్తంగా వేడుకలా జరుపుకొంటారు. బాలల దినోత్సవం అంటే.. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పుట్టిన రోజు. మరి ఆయన జన్మదినాన్ని 'చిల్డ్రన్స్ డే'గా నిర్వహించుకోవడానికి బలమైన కారణం ఉంది. అంతేకాదు.. ప్రపంచ దేశాలన్నీ నవంబర్ 20న బాలల దినోత్సవం జరుపుకొంటాయి. కానీ, భారత్‌లో మాత్రం ఆరు రోజులు ముందుగానే దీన్ని నిర్వహించుకుంటారు. నేడు బాలల దినోత్సవం సందర్భంగా దీని వెనుక ఉన్న చరిత్ర మన దేశ మొట్టమొదటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ. దేశానికి ఎక్కువ కాలం ప్రధానిగా సేవలు అందించింది కూడా ఆయనే. బ్రిటిష్ పాలనలో చతికిలపడ్డ దేశాన్ని తనదైన దార్శనికత, ముందుచూపుతో పురోగతి దిశగా నడిపించారు. 1889 నవంబర్ 14న పుట్టిన నెహ్రూకు పిల్లలన్నా, గులాబీలన్నా అమితమైన ప్రేమ. పిల్లలకు కూడా పండిట్ నెహ్రూ అంటే ఎనలేని ప్రేమ. ఆయణ్ని ముద్దుగా 'చాచా నెహ్రూ', 'చాచాజీ' అని పిలుచుకుంటారు. ఇష్టమైన మేనమామ/ బాబాయి అని దీని అర్థం. 1964లో నెహ్రూ మరణించిన తర్వాత ఆయన పుట్టిన రోజును 'బాలల దినోత్సవం'గా నిర్వహించాలని



భారత ప్రభుత్వం నిర్ణయించింది. నాటి నుంచి నవంబర్ 14ను 'చిల్డ్రన్స్ డే'గా జరుపుకొంటున్నాం. 1964 సం, వరకు బాలల దినోత్సవాన్ని నవంబర్ 20న నిర్వహించుకునేవాళ్లం. ప్రతి సం, నవంబరు 20 న పిల్లల దినోత్సవం నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలన్నీ తీర్మానించాయి. 1964 వరకు మనం కూడా ఇదే సంప్రదాయాన్ని కొనసాగించాం. కానీ, నెహ్రు మరణం తర్వాత నుంచి నవంబర్ 14న నిర్వహించుకుంటున్నాం. ఈ రోజున పాఠశాలల్లో పండగ వాతావరణం ఉంటుంది. పిల్లలకు ఇష్టమైన చాక్లెట్లు, ఇతర కానుకలను పంచిపెడతారు. వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో పిల్లల్లో ఉత్సాహం నింపుతారు. పిల్లల అరుదైన వేషధారణ కూడా ఆహ్లాదం నింపుతుంది. ఈ కార్యక్రమంలో బాల బాలికలు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ముందస్తు క్యాన్సర్ పరీక్షలు

**గుమ్మగట్ట - సూర్యవాస్తవం:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, గుమ్మగట్ట మండల పరిధిలో పూలకుంట, రంగసముద్రం మరియు తాళ్లకేరా సచివాలయం గ్రామాల లో గుమ్మగట్ట మండల వైద్యాధికారి డాక్టర్ రమేష్ పాల్గొని అందరికి క్యాన్సర్ పరీక్షలు కార్యక్రమంను సిబ్బందితో కలసి ప్రారంభించారు. అన్ని సచివాలయంలో ఆయా ఆయా ఏఎన్ఎం, ఎం ఎల్ హెచ్ పీ, ఆశా సిబ్బంది పాల్గొని కార్యక్రమంను ప్రారంభించారు. డాక్టర్ మాట్లాడుతూ" క్యాన్సర్ యొక్క ప్రారంభ సంకేతాలు, లక్షణాలను గుర్తించడంలో ప్రజలకు, తద్వారా వారు ప్రారంభ దశలో చికిత్స పొందేందుకు వీలు కల్పిస్తుంది. ప్రధాన ప్రమాద కారకాల గురించి ప్రజలకు అవగాహన, ఎందుకంటే 30% కంటే ఎక్కువ క్యాన్సర్ కేసులను జీవనశైలిని సవరించడం లేదా ప్రమాద కారకాలను నివారించడం ద్వారా నివారించవచ్చు. రెగ్యులర్ స్క్రీనింగ్, చెక్-అప్ల ప్రాముఖ్యత గురించి ప్రజలకు తెలియజేయండి. మామోగ్రామ్లు, క్లినికల్ బ్రెస్ట్ పరీక్ష, రొమ్ము స్వీయ-పరీక్షల గురించి మహిళలకు తెలియజేస్తూ. గర్భాశయ క్యాన్సర్ సంకేతాలను తనిఖీ చేయడానికి పాప్ స్మియర్ పరీక్షల గురించి మహిళలకు తెలియజేశారు. ఇంటి వద్దనే 18 సం దాటిన ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఏఎన్ఎం ఎం ఎల్ హెచ్ పి, ఆశా సిబ్బంది



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారు. ఈ కార్యక్రమం నందు రక్త పోటు, మధు మేహం, నోటి క్యాన్సర్ పరీక్షలు, రొమ్ము పరీక్షలు, గర్భసాయ పరీక్షలు ఉచితంగా చేయుదురు, నిర్ణయించిన రోజుల్లో ప్రతి సచివాలయం లో రోజుకు 5 ఇల్లులు సర్వే చేసి వివరములు అన్నియు ఆన్లైన్లో అప్డేట్ చేస్తారు. అనుమానము ఉన్న క్యాన్సర్ వారిని క్యాన్సర్ హాస్పిటల్‌కు రెఫర్ చేస్తారు. కావున ప్రజలు ఈ అవకాశము సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ నాయక్, డాక్టర్ సందేశ్, సిహెచ్ఓ మురళీధర్ పాల్గొని పర్యవేక్షణ చేశారు.

# పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులదే కీలక పాత్ర

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం:** పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులదే కీలక పాత్ర అని జిల్లా ఎస్పీ పి.జగదిష్ దంపతులు అభిప్రాయాన్ని వెల్లడించారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లోని పోలీసు కాన్ఫరెన్స్ హాలులోరక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలు పిల్లల నడుమ ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్పీ తో పాటు ఆయన సతీమణి హేమ జగదీష్ పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా ఎస్పీ దంపతులు మాట్లాడారు. చిన్నారులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు. పిల్లల భవిష్యత్తు నిర్దేశంలో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకం. ఫ్యామిలీ అభివృద్ధి, శ్రేయస్సు, భద్రత చూడాల్సిన బాధ్యత మీపై ఉంది. రాబోవు విద్యాసంవత్సరంలో ఫస్ట్ క్లాస్ పోలీసు పిల్లలు చదువుకునేలా అనుమతుల కోసం దరఖాస్తు చేశాము. అంతేకాకుండా స్పానిష్ టీచర్ కోసం కూడా ఆర్డీటీ వారికి లెటర్ పెట్టాము. పిల్లలకు చదువుతో పాటు ఆటలు, డ్యాన్స్, ఇతర అభివృద్ధికి కృషి చేస్తామని పిలుపునిచ్చారు. అనంతరం ప్రీ ప్రైమరీ స్కూలు పిల్లలకు బిస్కెట్స్, పెన్నులు,



తదితరాలను అందజేశారు. ఈసందర్భంగా పిల్లలు పాటలు, నృత్యాలు, వేమన పద్యాలులో ప్రతిభను చాటారు. మెజీషియన్ ఇచ్చిన ప్రదర్శన పిల్లల్ని సంతోషపరిచింది. ఆకట్టుకున్న రోడ్డు భద్రతా నియమాల పాటింపుపై ప్రదర్శన రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలు పిల్లలు బృందంగా ఏర్పడి రోడ్డు ప్రమాదాల నియంత్రణ... రోడ్డు భద్రతా నియమాల పాటింపుపై చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. వాహన చోదకులు, పాదాచారులు ఎలాంటి నియమాలు పాటించాలో ప్రదర్శన ద్వారా అవగాహన చేశారు. రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలు పిల్లల కోసం సిద్ధం చేసిన గదిని ప్రారంభించిన జిల్లా ఎస్పీ సతీమణి జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లో నిర్వహిస్తున్న రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలు పిల్లల కోసం సిద్ధం చేసిన గదిని జిల్లా ఎస్పీ సతీమణి హేమ జగదీష్ గురువారం నాడు ప్రారంభించారు. ఇప్పుడు ఉన్న తరగతి గదులతో పాటు అదనంగా పునరుద్ధరించిన ఈ గదిని చిన్నారుల కోసం వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు డి.వి.రమణమూర్తి, ఇలియాజ్ బాషా ( ఏ.ఆర్ ), సి.ఐ లు ధరణీ కిశోర్, క్రాంతికుమార్, దేవానంద్, ఆర్ ఐ లు రెడ్డెప్పరెడ్డి, మధు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్ పాల్, లక్ష్మినారాయణ, సరోజ, రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలు పిల్లలు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

**నార్పల - సూర్య వాస్తవం:** మండల కేంద్రమైన నార్పల గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిని కే. జీవన ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, రిటైర్డు కండక్టర్ ప్రసాద్, రాష్ట్ర ఉత్తమ గ్రామీణ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత సీనియర్ గ్రంథాలయ పాఠశాలలో పాత్రికేయులు లక్ష్మీనారాయణ చే గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చాచా నెహ్రూ జయంతి అయిన బాలల దినోత్సవం పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి మొదటి ప్రధానమంత్రిగా చాచా నెహ్రూ ఎంతో మేలు చేశారన్నారు. ఆయనకు బాలలంటే ఎంతో ఇష్టమని,భారతదేశంలో సామ్యవాద ఆర్థిక వ్యవస్థను కృషి చేశారన్నారు. మతాల మధ్య సామరస్యత ఉండాలని ఆకాంక్షించినటువంటి గొప్ప వ్యక్తి నెహ్రూ అన్నారు. గ్రంథాలయాలలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు ఎస్సార్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, ఐఎన్ జి వెంకటరమణయ్య మొదలైన వారిని స్మరించడం



జరుగుతుందన్నారు. 17 న కవి సమ్మేళనము, సెమినార్లు రచయితల సందేశాలు ఉంటాయన్నారు. 18 పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖనము, వ్యాసరచన వకృత్వ క్రీడా పోటీలు ఉంటాయన్నారు. 19 మహిళాలకు వివిధ కార్యక్రమాల్లో పోటీలు నిర్వహించుడం రంగవల్లులు, అల్లికలు ఉంటాయన్నారు 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన సామూహిక స్వీయ పఠనం వారోత్సవాలు ముగింపు వేడుకలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి చదువుకోవడానికి విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు వీటిని పెద్దలు పిల్లలు ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

# కబడ్డీ ఆత్మీయ సమ్మేళనం

**పామిడి - సూర్యవాస్తవం:** అనంతపురం జిల్లా గుంతకల్ నియోజకవర్గం గుంతకల్ పట్టణం, బుధవారం రోజున గుంతకల్ రైల్వే ఇన్స్టిట్యూట్‌లో జిల్లా కబాడీ ఆత్మీయ సమ్మేళనలో పాల్గొన్న అనంతపురం జిల్లా మాజీ కబడ్డీ చైర్మన్ తెలుగుదేశం పార్టీ



సీనియర్ నాయకుడు.ఆర్.హరినాథ్ గౌడ్, కబడి అసోసియేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ బాలల దినోత్సవం



**రాప్తాడు - సూర్య వాస్తవం:** భారత ప్రథమ ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సంధర్భంగా జాతీయ బాలల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించామని హెడ్మాస్టర్ సాంబశివ పేర్కొన్నారు. రాప్తాడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జాతీయ బాలల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పండిత్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పండిత్ నెహ్రూ జీవిత విశేషాలను మరియు భారత దేశ ఉన్నతికి చేసిన సేవలను వివరించారు. విద్యార్థిని విద్యార్థులు రంగురంగుల దుస్తులలో అహ్లాదకరంగా కమ్మనైన పాటలతో అలరించారు. సీనియర్ ఉపాధ్యాయులు రోజారమణి, రాజేశ్వరి లక్ష్మన్న పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆశీస్సులు అందించారు.

# ఆకుల రఘురామయ్యకు సన్మానం

**నార్పల - సూర్య వాస్తవం:** కవి కాకి కోగిర జై సీతారాం శత జయంతి వేడుకల్లో ఆకుల రఘురామయ్యకు సన్మానం చేశారు. కవి కాకి కోగిర జై సీతారాం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కోగిర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జై సీతారాం శత జయంతి వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా జనప్రియ కవి ఏలూరు యంగన్న వ్యవహరించారు. ఈ సందర్భంగా



నిర్వహించిన కవి సమ్మేళనంలో తానా కవితా పురస్కార గ్రహీత ఆకుల రఘురామయ్య ఆలపించిన "కవికాకి" కవిత అందరి ప్రశంసలు పొందినది. కోగిర జై సీతారాం సేవా ట్రస్ట్ అధ్యక్షులు కోగిర జయచంద్రారెడ్డి, సత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిల్లి జయచంద్ర చేతుల మీదుగా ఆకులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య స్కూల్‌లో బాలల దినోత్సవం



**పామిడి - సూర్య వాస్తవం:** స్థానిక పామిడి శ్రీ చైతన్య స్కూల్ నందు బాలల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో సీఈఓ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ మన భారత మొట్టమొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ గారి జయంతి రోజున బాలల దినోత్సవాన్ని జరుపుకుంటామని అలాగే నెహ్రూకి పిల్లలు అంటే అమితమైన ప్రేమని అందుకే నెహ్రూని పిల్లలు చాచా అని పిలిచేవారని తెలియజేశారు. డైరెక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి ప్రతి విద్యార్థి కూడా క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అలాగే మీరందరూ కూడా దేశాభివృద్ధిలో భాగం కావాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అహుడ చైర్మన్‌కి స్వాగతం



**అనంతపురం - సూర్య వాస్తవం:** అహుడ చైర్మన్ గా ఎన్నికై టిసి వరుణ్ మొట్టమొదటిసారిగా రోడ్డు మార్గాన అనంతపూరం కి విచ్చేసిన సందర్భంగా పట్టణంలో స్వాగతం పలికారు అనంతపురం 15 వ వార్డ్ జనసేన ఇన్చార్జి జయకృష్ణ. ఈ సందర్భంగా టి సి వరుణ్ మాట్లాడుతూ... జనసేన పార్టీ నాయకులకు కూటమి ప్రభుత్వ కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు వచ్చినా నేనుంటానని భరోసా ఇచ్చారు.

# మహబూబ్ సుభాని కట్టను ప్రారంభించిన టిడిపి నాయకులు ఆకుల బాబు

**నార్పల - సూర్య వాస్తవం:** మండల కేంద్రమైన నార్పలలోని ఉయ్యాల కుంట కాలనీలో గురువారం సాయంత్రం నార్పల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఆకుల విజయ్ కుమార్ (బాబు) మహబూబ్ సుభాని కట్టను ప్రారంభించారు. గతంలో శిథిలమైన ఈ కట్టను స్థానిక ముస్లీం సోదరుల,



కాలనీ వాసుల విన్నపం మేరకు మరమ్మత్తులు చేయించి ఆధునీకరించారు. పనులు అన్ని పూర్తి కావడంతో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం సోదరులు స్థానిక కాలనీవాసులు ఆకుల బాబుకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )